కథ

# జీయమ్మగారు

**రెండవ వారం**

మూడు తరాల కథ

## - పసుపులేటి పూర్ణచంద్రరావు

జీయమ్మ గారు తన అరవైల చివర్లో ప్రియమైన తన తల్లిని కోల్పోయింది. కానీ ఈ దుర్ఘటన ఆవిడ నిజమైన వృద్ధాప్యంలో జరగడం వల్ల అతి తక్కువ కాలంలోనే జీయమ్మ గారు తన సోకాల్డ్ ప్రశాంతతని తిరిగి రాబట్టుకోగలిగింది. అయితే తల్లి పోగానే అన్నేళ్ళ వ్యసనం - నశ్యం, ఖారాకిళ్లీ రెంటినీ చటుక్కున మానేసింది! బహుశా తల్లి జ్ఞాపకాల్ని వదిలించుకోవడానికి కాబోలు!

**ని**జానికి అతి తక్కువ కాలంలోనే తల్లిని మర్చిపోయింది కానీ, క్రమంగా తానే తన తల్లి పాత్రలోకి ప్రవేశించింది. ఊళ్ళోనే వున్న తన ఏకైక కూతురు మణెమ్మ గారింటికి - అచ్చం ఎర్ర పెద్దమ్మగారి సాంప్రదాయాన్నే కంటిన్యూ చేస్తూ - ప్రతిరోజూ మధ్యాహ్నం వెళ్లేది, భోంచేసి కాసేపు పేలు కుక్కించుకొని, టీ తాగి సాయంత్రానికల్లా ఇల్లు చేరుకునేది.

కూతురుమీద ఈగ వాలనిచ్చేది కాదు. తన మనవరాలి పెళ్ళికి తన కొడుకు మణెమ్మ దగ్గిర కొంత అప్పు తీసుకోక తప్ప లేదు. తీర్చడం సహజంగానే లేటయితే, మణెమ్మ భర్త అడగ లేదుగానీ, మణెమ్మే అన్నని నిలేసింది, తనకూ ఏదో డబ్బు అవ సరం వొచ్చినప్పుడు. కొంచెం గట్టిగానే నిలేసింది కాబోలు ...

''నన్ను పెంచి పెళ్ళి చేసిన అన్ననే ఇంత అమర్యాదకరంగా కడతావా ... ఛస్తావా ... అని నిలేస్తావే మణేశ్రీ'' అని గయ్యిమని లేచాడు అన్న. ''ఉన్న పళంగా ఎక్కడ్నించి తేనూ ...?'' అని లబలబలాడాడు.

వెంటనే జీయమ్మ గారు కల్పించుకొని, తన కూతుర్ని తిట్టే హక్కు సొంత అన్నకైనా లేదు ఫొమ్మంది -

**జరిగిన కథ**

*జర్దాకిళ్లీ నమలడం, నస్యం పీల్చడం వంటి చిన్న చిన్న వ్యసనాలు తప్ప 90 ఏళ్ళు వయసు వచ్చినా ఏ రోగమూ లేని వృద్ధురాలు జీయమ్మగారు. ఆమె జీవితమంతా అయిన వాళ్ళ చావులతోనే ముడిపడి వుంది. ఈ వయసులో కూడా తన పనులు తనే చేసుకుంటుంది. ఎవరి మీదా ఆధారపడదు. రోజూ నడిచే జీవితం నుంచే అనుభవాలు గ్రహిస్తూ ప్రశాంతత పొందుతూ వుంటుంది.*

''కట్టలేనప్పుడు నోరు మూసుకోని బ్రతిమిలాడుకో లేదా తర్వాతిస్తానని సక్రమంగా చెప్పుకోగానీ, మణిని తిట్టే హక్కు నీకు లేదు ...'' అని కొడుకుని మందలించింది.

''ఏం! అది నా సొంత చెల్లెలు కాదా ...?''

''అయినా తిట్టే హక్కు నీకు లేదు - పెళ్ళయ్యి, దానింటికది వెళ్ళి పోయిం తర్వాత ... నువ్వెంత అన్నవైనా సరే!''

''మరి ... అది నన్ను నిలేస్తుందా పెద్దా చిన్నా లేకుండానూ ...?''

''పెళ్ళయ్యి, వెళ్ళిపోయింతర్వాత, సొంత చెల్లెలైనా బైటి మనిషే అని గుర్తుంచుకో! చెల్లికైనా మర్యాదిచ్చి మాట్లాడవల సిందే.''

''ఆ ...! ఇస్తారు మర్యాద ...! అది మర్యాదగా మాట్లా డిందా?''

''అదెలా మాట్లాడినా, నువ్వు మాత్రం మర్యాదగానే మాట్లాడాలి ఆడపిల్లతో. పైగా దాని దగ్గర డబ్బు తీసుకున్నప్పుడు ఇంకాస్తంత ఒదిగి వుండాలి ...!''

''ఎందుకుండాలీ ...? దాని డబ్బేవన్నా ఎగ్గొడుతున్నానా? నాల్రోజుల తర్వాత ఇవ్వనా...?''

''ఆ సంగతి మర్యాదగా చెప్పుకో! అంతేగానీ అరిచి కాదు ...''

''ఆ ...! అరిచి కాదు ...! ఇప్పుడంటే, ఖర్మగాలి, తీర్చా ల్సిన వాణ్ణయి పోయాను గానీ, పెట్టినంత కాలం దానికి పెట్టలేదా నేను ...?''

''ఎవరికోసం పెడతావ్? అన్నవి పెట్టడం నీ ధర్మం! అంతే గానీ తిరిగి తీసుకొనే హక్కు నీకు లేదు ...''

''తిరిగి తీసుకోవడం ఏవిటి...? అప్పు తీసుకున్నాను. తిరిగి ఇచ్చేయనా ...?''

''ఆ! ఇచ్చేయ్! ఎప్పుడిస్తావో చెప్పి, దాన్ని పంపించెయ్యి ..! అంతకన్నా ఇంకేం మాట్లాడమాకు!''

జీయమ్మ గారు తల్లే అయినా, తండ్రిలాగా మాట్లాడడం ఆవిడకు అలవాటే! అయితే ఇలాంటి టోన్‌లో మాట్లాడడం ఎప్పుడోగానీ చేయదు. ఆవిడ్లో ఈ కరకు టోన్ వినిపిస్తే, ఎవరైనా సరే తగ్గవలసిందే. ఆ కొడుక్కి తల్లయినా, తండ్రయినా జీయమ్మ గారే కదా!

ఎవరైనా సరే ఇన్నేళ్ళల్లో జీయమ్మ గారు కూతుర్ని తిట్టడం గానీ, కసరడం గానీ చూసిన పాపాన పోలేదు. ఆ మాట కొస్తే కొడుకుని కూడా ఇలా మందలించడం అన్నది చాలాచాలా రేర్‌గా చేస్తుందావిడ. ఎప్పుడో గానీ ఆ తల్లి గొంతులో తండ్రి వినిపిం చదు! కాబట్టి జవాబిచ్చినా గొణుగుతూ తన పాయింట్ ప్లీడ్ చేసు కోవడవే కానీ, తల్లి స్థాయిని మించి మాట్లాడడం ఆ కొడుక్కి కూడా తెలియదు. ఆవిడ్ని ఆబ్సెన్స్‌లో కూడా 'జీయమ్మ' అనే ధైర్యం ఎవరికీ వుండదు. 'జీయమ్మ గారూ ...' అనవలసిందే!

☆ ☆ ☆

**జీ**యమ్మ గారికి ఎవరిమీదైనా కంప్లయింట్స్ వుండవని కాదు. కోడలి మీద ఆవిడికి సైలెంట్ కంప్లయింట్స్ చాలా వుండేవి. కానీ,

''అత్తగారు ఆరళ్ళు పెట్టేది ...!!'' అన్న అప్రతిష్ఠ మాత్రం ఆవిడికి వుండేది కాదు. కొంచెం అలుగుడు మనిషి కానీ, అరిచే మనిషి కాదు - అత్తగారిగా!

మళ్ళీ ఆ అలుగుడులోనూ ఓ ఆర్డరుండేది -

వారానికో, పది రోజులకో మాంసం తెప్పించి కోడలు వొండుతున్నప్పుడు, తనకు ప్రత్యేకంగా తలకాయ మాంసం కావాలి అనేది జీయమ్మ గారు, అప్పుడప్పుడూ!

''ఛీ ...! తలకాయ మాంసం ఏవిటీ ...? లేబర్ తిళ్ళూ ..!'' అని కొట్టిపారేసేది కోడలు.

ఇక ఆ తర్వాత ఎంత మంచి మాంసం వేపుళ్ళు చేసినా సరే, ''హూ ...!'' అని హూంకరిస్తూ, కాస్తంత ముట్టుకునేదే తప్ప, సరీగా తినేది కాదు.

అయితే ఆ పాటి దానికే జీయమ్మ గారు తన ప్రశాంతతని ఎక్కువ సేపు పోగొట్టుకొనేది కాదు. అడిగితే కోడలు ఇవ్వని దాని గురించి ఎక్కువ సేపు అలక్కుండా, అడిగితే ఇచ్చేదాన్నే ఇప్పించుకొని సంతోషించేది -

ఎండు ఖర్జూర కాయల్ని నీళ్లలో నానేసి, పటికబెల్లం కలుపుకొని తాగడం జీయమ్మ గారి ప్రైకికల్లగ్జరీ. తలకాయ మాంసానికి కంపెన్సేషన్గా తన ఫేవరేట్ డ్రింక్ని అడిగి చేయించుకొని, తాగి సంతోషించేది.

అలా జీవితంలో ఓ మెట్టు తప్పితే, మరో మెట్టు ఎక్కడం ఎలాగో జీయమ్మ గారికి బాగా తెలుసు. ఎక్కలేని మెట్టు వొదిలేసి, ఎక్కగలిగిన మెట్టునే ఎక్కి సంతోషించేది. బహుశా జీయమ్మ గారి ప్రశాంతత వెనక సీక్రెట్ ఇదేనేమో!




జీయమ్మ గారి ఈ జీవనతత్వం ఆమె జీవితానికి డెబ్బయిలు దాటేదాకా బాగానే పని చేసింది. కానీ, ఎనభయిల్లోకొచ్చేసరికి ఏ తత్వమూ పని చేయదు కాబోలు! కారణం ఏమోగానీ, ఎనభయిల చివరిల్లోకి ఆమె వయసు వాలిపోగానే ఇన్నాళ్ళూ పెంచుకొచ్చిన సోకాల్డ్ ప్రశాంతతని జీయమ్మ గారు ఛటుక్కున కోల్పోయింది..!

తన యవ్వనంలో భర్తని కోల్పోయినా, యవ్వనం దాటని చిన్న కొడుకు చనిపోయినా చలించని జీయమ్మ గారు, తన ఎనభయిల చివర్లో ఒక్కసారిగా చెలించిపోయింది - తన అల్లుడి చావుతో ...! తన ప్రాణానికి ప్రాణమైన కన్న కూతురి వైధవ్యంతో ..!

కూతురి భర్త అకాలంగానేమీ పోలేదు. అన్ని సర్దుబాట్లూ చేసిపెట్టి, రిటైర్ అయ్యింతర్వాతనే పోయారు, గుండెపోటు వల్ల.

కానీ అల్లుడి చావుతో తన ప్రశాంతతని కోల్పోవడమే కాదు; ఇతర్ల ప్రశాంతతని కూడా కొల్లగొట్టడం ప్రారంభించింది జీయమ్మ గారు! ఏవిటా మార్పు ...?

☆☆☆

**జీ**యమ్మ గారిలో ప్రశాంతతని పోగొట్టుకునేంత మార్పు ఎందుకొచ్చిందో, ఆ కథ చెప్పే ముందు, ఆవిడికీ నాకూ గల సంబంధం ఏవిటో కూడా కాస్తంత చెప్పాలి -

జీయమ్మ గారు స్వయానా మా మేనత్త. మా నాన్న సొంత చెల్లెలు. జీయమ్మ గారి అసలు పేరు జయమ్మ. జయమ్మ అన్న పేరు 'జీయమ్మ'గా ఎలా రూపాంతరం చెందిందో ప్రస్తుతం ఎవరికీ తెలీదు.

నేను పుట్టక మున్నెప్పుడో భర్తని కోల్పోయింది కనుక, నేను బుద్ధెరిగిందగ్గరనించీ మా మేనత్త విధవరాలే. ఆవిడ్ని గొప్ప అందగత్తె అనలేముకానీ, 'పెళ్ళి చేసి చూడు' నాటి జి.వరలక్ష్మి టైపులో వెడల్పాటి ముఖం, పొడుగాటి ముక్కుతో, ఏవరేజి ఎత్తుతో చాలా డిగ్నిఫైడ్ పర్సనాలిటీయే అని మాత్రం చెప్పొచ్చు.

ఇంతవరకూ చెప్పని సంగతి ఇప్పుడొకటి చెబుతున్నాను -

అరవైలు దాటినప్పటి నించీ జీయమ్మ గారిలో ఓ కొత్త వెలితి బైటపడింది. అదేమిటంటే చెవుడు ..! అసలు ఎవరిమీదా అరవని మనిషితో, అరిచి మాట్లాడవలసి వచ్చేది క్రమంగా ప్రతి వాళ్ళకూ! అలా ఆవిడి సీరియస్

అన్ని ఏర్పాట్లూ చేసే పోయారాయన. దినాలకెళ్ళినప్పుడు మణి కొడుకు రవి బాధ్యతగా అన్ని పనులూ చేసుకోవడం చూసి ఆనందించాను.

అంతా బాగానే వుంది కదా ... మరి జీయమ్మ గారు ఎందుకంత చలించి పోయిందో అల్లుడి చావు తర్వాత అన్న సంగతి మాత్రం వెంటనే నాకర్థం కాలేదు.

మణి కుటుంబంతో రెగ్యులర్‌గా టచ్‌లో లేకపోవడం వల్ల నా భ్రమలో నేనున్నాను - అంతా బాగానే వుందనుకొని. కానీ నిజం వేరు! తండ్రి పోయిం తర్వాత మణి కొడుకు వ్యాపారాన్ని దివాళా తీయించాడట ...! వ్యసనాల వల్ల కాదు; వ్యాపార దక్షత లేక ...! దాంతో వాడి పెళ్ళి వెనక్కి పడిపోయింది ...!

మగపిల్లవాడు కదా, పోనీ పెట్టుబడి పెట్టి చూద్దాం, బాగుపడతాడేమో అని కూడా పెద్ద కట్నం ఇవ్వడానికి ఆడపిల్లల తండ్రులెవరూ ముందుకు రాలేదు. దానికో దురదృష్టకరమైన కారణం వుంది -

రవికి చిన్నప్పుడెప్పుడో తప్పుడు వైద్యం వల్ల ఓ కన్ను పోయింది ...! మాంఛి ఒడ్డూ, పొడుగూ, రంగు, రూపూ వున్న కుర్రాడికి ఒక కన్నులేనితనం ఎంత బాధాకరం ...! పిల్లనిచ్చేవాళ్ళు గుటుక్కున ముందుకు రారు కదా ...!

ఎన్నడూ ఏడవాల్సిన అవసరం రాని మణికి, ఇప్పుడు కన్నకొడుకు పరిస్థితి చూసి ''ఇదంతా నా ఖర్మం...!'' అని ఏడుస్తోంది. కూతురంటే పంచప్రాణాలు కావడం వల్ల, కూతురి కన్నా ముందు జీయమ్మగారే ఎక్కువ గిలగిల్లాడిపో తోంది - మనవడి గురించి ... మనవడి పెళ్ళి గురించీ.

తనకి సాధ్యంకాని పనుల్లో ఎప్పుడూ వేలుపెట్టని జీయమ్మ గారు, ఇప్పుడీ ముది వయసులో తనకు సాధ్యంకాని పనిలో వుత్త వేలేకాదు, సొంత తలకాయే పెట్టిపారేసింది ...!

ఎంతకీ కాకుండా మొండికేసిన తన మనవడి పెళ్ళిని తనన్నా పూనుకొని చేయించాలని నిర్ణయించుకుంది. కొడుకుని ఎన్నడూ ఏ చిన్న కోరికా కోరని జీయమ్మ గారు, తన డెబ్బయి రెండేళ్ళ కొడుకుని పిలిచి, ''ఎప్పుడో నీ చెల్లెలికి కష్టపడి పెళ్ళయితే చేశావుగానీ, ఇప్పుడు దాని పరిస్థితి బాగాలేదు. కాబట్టి, దాని కొడుక్కి నువ్వే దగ్గరుండి పెళ్ళి జరిపించు...'' అని ఆర్డర్ వేసింది!


పాపం, ఎలా చేస్తాడు మా బావ? పిల్లనివ్వడానికి ఎవరన్నా ముందుకొస్తేనే కదా! వాడికి పెళ్ళి కావాలంటే - ముందు వాడి వ్యాపారం బాగుపడాలి. లేదా మంచి ఉద్యోగమన్నా దొరకాలి. కనీసం టెన్త్ కూడా చదవని వాడికి ఉద్యోగం ఎవరిస్తారు? ఇచ్చినా ఏ ఉద్యోగం ఇస్తారు? ఈ రిజర్వేషన్ల రోజుల్లో చప్రాసీ ఉద్యోగం కూడా అంత తేలిక్కాదు కదా దొరకడం ...!

ఓ షాపులో ఉద్యోగం ఇప్పించాడు మేనల్లుడికి మా బావ. ఆ బోడి ఉద్యోగానికి పిల్లనివ్వడానికి ముందుకెవరొస్తారూ ..? ఎవరూ రాలేదు. ఆ పనికిమాలిన పని వాడికీ నచ్చలేదు. వాడికి నచ్చిన పనిని ఎవ్వరూ ఇవ్వలేదు. రోజురోజుకీ వాడికి వయసు పెరిగింది...! క్షణక్షణానికీ జీయమ్మ గారికి ఆందోళనా పెరిగింది...! ఆడపిల్ల పెళ్ళి గురించి కాదు... 'ఓ మగ పిల్లవాడి పెళ్ళి గురించి ...!

''ఈ బోడిముండ గుమ్మస్తా ఉద్యోగాలు ఎన్ని చేసినా, పిల్లనిస్తానని ఏ దరిద్రుడూ రాడులేగానీ, ఎలాగోలా పెట్టుబడి పెట్టించి, రవిబాబుతో ఏదైనా వ్యాపారం పెట్టించు ...!'' అని రెండో ఆర్డర్ పారేసింది జీయమ్మ గారు తన కొడుకు మీద!

ఎక్కడ్నించి తెస్తాడు పెట్టుబడి మా బావ ...? రిటైర్‌మెంట్ తర్వాత ఆయన కొచ్చేదెంత ...?

కొద్దిపాటి పెన్షన్; అద్దెకిచ్చిన పోర్షన్ నించి వచ్చే కొద్దిపాటి అద్దె ... అంతే




కదా!

దూరంగా అంటీముట్టనట్టే బ్రతుకుతున్న పెద్ద కొడుకు; ఇంటి పట్టునే వున్నా, ఇంకా సరిగ్గా స్థిరపడని చిన్న కొడుకు .. వాడి పెళ్ళాం, ఇద్దరు పిల్లలు ..

అన్నిటికన్నా మించినభారం - పక్షవాతంవచ్చి మంచంలోపడున్న భార్య...

ఇదీ మా బావ లగేజి ...!

డెబ్బయి రెండేళ్ళ వయసులో, ఇన్ని బాధల్లో మేనల్లుడి బాధ్యతని కూడా నెత్తిమీద వేసుకోవడం మా బావకు సాధ్యం కాని పని. అయినా ఆ మానవుడు దేనికీ 'నో' అనడు కనుక, తల్లివేసిన ఆర్డర్‌కి నోరు మెదపలేదు. అలాగని 'ఎస్' అంటూ ముందుకూ దూకలేడు కదా! తటస్థంగా వుండిపోయాడు.

చకచకా ఏదీ జరక్కపోవడంతో జీయమ్మ గారికి లేని బి.పి విపరీతంగా పెరిగిపోయి, ''చేస్తావా...! ఛస్తావా...!'' అని మా బావని నిలేసింది.

''పెట్టుబడి సాధ్యం కాదు'' అని తేల్చి చెప్పక తప్పలేదు మా బావకు.

ఆ మాట ''రవిబాబుకి పెళ్ళి చేయడం సాధ్యం కాదు'' అనే అర్థం అయ్యింది జీయమ్మ గారికి.

''వీలు కాదు' అన్నప్పుడు, పూర్వం వూరుకునేది జీయమ్మ గారు. కానీ ఇప్పుడు ''ఎందుకు వీలుకాదు ...?'' అనడం మొదలెట్టింది కొత్తగా!


రోజుకొకసారన్నా కొడుకుని నిలేయడానికి అలవాటు పడిపోయింది జీయమ్మ గారు - ''రవిబాబు పెళ్ళి చేస్తావా ...? ఛస్తావా ...?'' అని!

ఆ తర్వాత కనబడ్డ వాళ్ళందరితోనూ మా బావ మీద కంప్లయింట్ చేయడం మొదలెట్టింది - ''మీరన్నా కాస్తంత మా అబ్బాయికి బుద్ధి చెప్పండీ, మేనల్లుడి పెళ్ళి జరిపించమనీ ...'' అంటూ!

ముసలమ్మ గోల భరించలేక ఇంటికొచ్చిన వాళ్ళు నవ్వినా కోపమే...! ఏదన్నా మాట్లాడినా కోపమే ...! ఎవరేం మాట్లాడినా ఆవిడకి వినపడదు కదా! అయినా మాట్లాడిన వాళ్ళ పెదాల కదలిక నించి కొంత గ్రహించి, తిరిగి జీయమ్మ గారు ఏదో అనడం ... వాళ్ళు ఇంకేదో అనడం ... ఈ ప్రాసెస్‌లో ఈవిడకి మరింత తిక్కరేగిపోవడం ... మామూలైపోయింది!

ఈ వన్-వే-ట్రాఫిక్ శ్రవణంలో లోకమంతా తనకు, తన మనవడికీ వ్యతిరేకంగా ఏదో గూడు పుఠాణీ చేస్తున్నారు అన్న అనుమానం పెరిగిపోసాగింది జీయమ్మ గారిలో!

చివరికి, ''మీరు చేసేదేవిట్రా వెధవల్లారా..! నా మనవడి పెళ్ళి నేనే చేస్తాను ...!'' అని తనలో తాను అందరిమీదా ఛాలెంజ్ చేసింది! కానీ నిజంగా ఎలా చేయగలదు ఆ ముసలమ్మ - ఉత్త అహం కాకపోతే! ఏవైనా సొంత ప్రయత్నాలు చేయడానిక్కూడా ఏదన్నా ఆధారం వుండాలి కదా!




ఏ మార్గమూ కనపడక, సడన్‌గా జీయమ్మ గారి దృష్టి నా మీదికి మళ్ళింది (ట) - తర్వాత మా బావ చెబితే తెలిసింది! అలా జీయమ్మ గారి కథలో నా పాత్ర మొదలయ్యింది ...!

ఎప్పుడో పత్తాలేకుండా పోయిన మేనల్లుడ్ని, ఈ మధ్య మేనత్త మీద అభిమానంతో వచ్చి పోతున్నాను కదా ...! నన్ను మళ్ళీ మళ్ళీ చూడగానే సర్... సర్రున స్పార్క్‌లు చెలరేగాయి జీయమ్మ గారి బుర్రలో ...!

ఆ స్పార్క్ ఏవిటంటే - నా కూతుర్ని తన కూతురి కొడుక్కిచ్చి పెళ్ళి చేసి పారేస్తే పోలేదా ... అని!

ముసలమ్మకి మతి చెడిందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి ...? మణి నాకు ఒదినయినప్పుడు, ఆవిడ కొడుకు నాకేమవుతాడూ ...? అన్నగారి కొడుకు కదా ...! అంటే రవిగాడు నాకూ కొడుకే కదా...! మరి, వాడికి నా కూతుర్నిచ్చి చేయడం ఏవిటీ...?

ఇంత ఘోరంగా వావివరసల్ని తప్పిందంటే, పూర్తిగా లాజిక్కుని కోల్పోయిందన్న మాటే కదా, ఆ ముసలమ్మ బుర్ర! ఆమె ఊహానికి ఎంత తోస్తే అంత ఆలోచించడం తప్ప, ఆ ఆలోచనలకి అర్థాల్నీ, లోక సమర్థాల్నీ గానీ పట్టించుకోవడం మానేసింది ఆవిడ బుర్ర!

అలా జీయమ్మగారి బుర్ర రాంగ్ రిథమ్‌లో పడిపోయింది ...! పాపం... అలా ఆవిడ మానసిక అగాధంలో ఓ నల్లని నాగుబాము తనలో తాను చుట్టలు చుట్టుకు పోయింది ...!

దాంతో కళ్ళు తెరిచి కూడా ఓ కలలాంటి స్టేట్ ఆఫ్ మైండ్‌లోకి దిగజారిపోయింది, మా నాన్నని జ్ఞాపకం చేసే మా మేనత్త గారు! వాస్తవానికీ, కలకీ సరిహద్దులు చెరిగిపోయిన ఆ మానసిక స్థితిలో, మాకెవరికీ తెలియనివ్వకుండానే, తన బుర్రలో తానొక్కతే నా కూతుర్ని, తన కూతురి కొడుక్కిచ్చి పెళ్ళిచేసి పారేసింది ...! చేయాలన్న కోరిక మాత్రమే కాదు; నిజంగానే చేసి పారేసింది తన మనసులో తానే ...!

వావివరసల్ని తప్పి, ఈ మానసిక పెళ్ళి చేయడానికావిడ చేసి పారేసినా, రవిగాడికిది అర్హతలేని పెళ్ళి అని కూడా ఆవిడ బుర్రలోని వాస్తవిక భాగం మళ్ళీ బలహీనంగానైనా టిక్‌టిక్ మంటూనే వుంది ...!

సరైన చదువు, ఉద్యోగం లేని వాడికి రాజా తన కూతుర్ని చచ్చినా ఇవ్వడు. అన్న నిజం టిక్‌టిక్‌మంటున్నా, ఆ నిజాన్ని అణిచిపెట్టి, అబద్ధమే... ఆత్మవంచనే మరింత విజృంభించి, పూర్తిగా రాంగ్ రిథమ్‌లో పడిపోయి, క్రమంగా ఆవిడ బుర్ర ఓ ''గజిబిజి దెయ్యం''గా మారిపోయింది ...!

చదువు లేదు ... ఉద్యోగం లేదు ... ఏ అర్హతా లేదు ... చదువు లేదు ... ఉద్యోగం లేదు... అర్హత లేదు ... చదువు ... ఉద్యోగం ... అర్హత ... లేదు ... లేదు ... లేదు ...

ఈ టిక్‌టిక్‌లకు ఉలిక్కిపడి, ''ఆ ...! అర్హత లేదంటారా నా మనవడికి ...! లేకపోతే ఆ అర్హత నేను కల్పిస్తాను ...!'' అంటూ ఆవిడ అహం పెట్రేగిపోయింది! ''సరైన వ్యాపారమో, ఉద్యోగమో లేదనే కదా నా మనవడ్ని పనికిమాలిన వాడ్ని చేశారూ ...? కావాలంటే, నేనిప్పిస్తా పట్టండి వాడికి ఉద్యోగం ...!'' అని ఆవిడ బుర్రలోని 'గజిబిజి దెయ్యం' ఆవిడ చేత ఛాలెంజి చేయించింది!

''ఏ ఉద్యోగం...?'' - తిరిగి ఆ దెయ్యమే ప్రశ్న కూడా వేస్తుంది!

''వేరే ఏదో ఎందుకు ...! తండ్రి చేసిన బాంక్ ఉద్యోగమే ...!'' - ఆ దెయ్యమే జవాబు కూడా చెబుతుంది!

''దుర్గమ్మ కొడుక్కి తండ్రి చనిపోతే, ఆయన ఉద్యోగమే ఇచ్చారు కదా ...! అలాగే నా మనవడికీ తండ్రి చేసిన ఉద్యోగమే ఎందుకివ్వరూ ...? ఇస్తారు ...! ఎవరికోసం ఇస్తారు ...! చచ్చినట్టుగా ఇచ్చి తీరాల్సిందే...! అది గవర్నమెంట్ రూలండీ బాబూ ...!'' - గజిబిజి దెయ్యానికి సెల్ఫ్ జస్టిఫికేషన్ కూడా బాగా తెలుసు!

ఇంకేంటీ-

''ఇచ్చేశారు ...! రవిబాబుకి బాంక్‌లో ఉద్యోగం ఇచ్చేశారు ...!''

''విన్నావే దుర్గమ్మా ...! నా మనవడిక్కూడా తండ్రి చేసిన ఉద్యోగం ఇచ్చారంట ..!

''జీతం అయిదు వేలంట ...!''

- ఎనౌన్స్ చేసి పారేసింది జీయమ్మ గారు బ్రహ్మానందపడిపోతూ!

తను ఆనందించినంతగా ఇంకెవరూ ఆనందించిన దాఖలాలు జీయమ్మ గారికి కనపళ్ళేదు - తన మనవడి బాంక్ ఉద్యోగం గురించి.

మరెలా ..? ఎలా నమ్ముతారూ...!

ఆ...! అలాని పేపర్లో వేశారని చెబుదాం ...! పేపర్లో కూడా వచ్చాక, ఇక నమ్మక ఛస్తారా...?

పేపర్లో వచ్చిన ప్రతిదాన్నీ చిన్నప్పట్నించీ నమ్మిన జీయమ్మగారి బుర్రకి, న్యూస్‌పేపర్ల మీద నమ్మకం అంత గొప్పది -

''రవిబాబుకి బాంక్‌లో ఉద్యోగం వొచ్చిన సంగతి పేపర్లో వేశారు చదివావురా కృష్ణమూర్తీ ...?''

''ఆ ...! ఆ...!'' - బుర్రూపి, వెళ్ళిపోయారు కృష్ణమూర్తి గారు.

''ఒసేయ్, దుర్గమ్మా ...! నువ్వు చూశావటే పేపరూ ...?''

జీయమ్మ గారి ఈ న్యూస్ పేపర్ ప్రకటన విని ముందు అందరూ షాకయ్యారని చెప్పాడు మా బావ. ఆ తర్వాత ఆవిడ వార్తలకి అలవాటు పడిపోయారట!

ఎవరన్నా పిల్లకాయిలు పరాచికంగా ''ఏ పేపర్లో వొచ్చింది మామ్మా...?'' అని ఎదురు ప్రశ్నవేస్తే, కోపంగా - ''అన్ని పేపర్లలోనూ వొచ్చింది. వెళ్ళి చూసుకోండే వెర్రి మొహాల్లారా?'' అని అదిలించేదట!

ఒక్కోసారి ''ఇదిగో చూసుకో...!'' అని చేతిలో వున్న పేపర్ని వాళ్ళ ముఖాన విసిరేసేదట!

''ఇందులో లేదు కదా ...?'' అని తుంటర్లు ఎవరన్నా గేలిచేస్తే, ''కళ్ళు పెట్టుకు చూడండిరా వెధవల్లారా ...!'' అని కోప్పడేదట!

ఒక్కోసారి ''మా కృష్ణమూర్తి చెప్పాడూ ... ఇంగిలీషు పేపర్లలో కూడా వొచ్చిందట మా రవిబాబుకి బాంక్‌లో ఉద్యోగం వొచ్చిందని ...!'' అని కూడా ఎవిడెన్స్‌ని బలపరుచుకునేదట!

(సశేషం)